ఈనాడు ఒడిశా
శనివారం సెప్టెంబరు 28, 2024

సరోగసీతో సంతానం పొందినా ప్రసూతి సెలవులు

రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం



భువనేశ్వర్, న్యూస్‌టుడే: సరోగసీ ద్వారా మాతృత్వాన్ని పొందాలనుకునే తల్లుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఓ వెసులుబాటు తీసుకువచ్చింది. అలా సంతానాన్ని పొందిన ఉద్యోగినులకు ఆరు నెలల ప్రసూతి సెలవులు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. దీనికింద మహిళా ఉద్యోగులకు 180 రోజులు, పురుష సిబ్బందికి 15 రోజుల సెలవులు తీసుకునే వెసులుబాటు కల్పించింది. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్న మహిళలు సరోగసీతో సంతానాన్ని పొందితే వారికి ఈ మాతృత్వ సెలవులు వర్తిస్తాయి. ఒకవేళ సరోగసీ కోసం గర్భాన్ని అద్దెకిచ్చిన మహిళ కూడా ప్రభుత్వ ఉద్యోగిని అయితే ఆమెకూ ఈ సెలవులు వర్తిస్తాయి. ఇద్దరు సంతానం వరకే సెలవులు పొందొచ్చు. ఇవి పొందాలంటే.. రిజిస్టర్డ్ వైద్యులు లేక ఆసుపత్రుల నుంచి సరోగసీ తల్లి, కమిషనింగ్ తల్లీతండ్రి మధ్య ఉన్న ఒప్పందాన్ని సమర్పించాల్సి ఉంటుందని ప్రకటనలో పేర్కొన్నారు.

వారే అర్హులు: చట్టబద్ధమైన వివాహం ద్వారా అయిదేళ్లు కలిసి ఉన్న దంపతులే సరోగసీకి అర్హులు. భార్యకు 23-50ఏళ్ల లోపు వయసు, భర్తకు 26-55ఏళ్ల వయసు ఉండి సాధారణ పద్ధతుల్లో సంతానం కలగని పరిస్థితుల్లో మాత్రమే ఆ దంపతులు సరోగసీ విధానంలో బిడ్డను పొందవచ్చు. సరోగసీ పద్ధతిలో సంతానం పొందుతున్నవారికి మాతృత్వ, పితృత్వ సెలవుల ప్రయోజనాలను కొన్ని నెలల క్రితం కేంద్రం పొడిగించిన నేపథ్యంలో రాష్ట్రం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.



హిరాకుడ్‌కు జలసిరి: 9 గేట్ల ఎత్తివేత

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండటంతో హిరాకుడ్ జలాశయానికి వరద నీరు పోటెత్తింది. శుక్రవారం మధ్యాహ్నం నాటికి సెకనుకు 92వేల క్యూసెక్కుల నీరు ప్రవేశిస్తోందని, అక్కడ నుంచి మహానదికి విడుదల చేస్తున్నామని ప్రధాన ఇంజినీరు ఆనంద్ చంద్ర సాహు విలేకరులకు తెలిపారు.

ముఖ్యమంత్రులు, గవర్నర్ భేటీ

45 నిమిషాల ఏకాంత చర్చ



రఘుబర్ దాస్‌తో మోహన్‌చరణ్ మాఝి, హిమంత బిశ్వశర్మలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ శుక్రవారం భువనేశ్వర్ వచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... తాను ఒడిశా గవర్నరు రఘుబర్‌దాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసేందుకు వచ్చినట్లు వెల్లడించారు. అక్కడ నుంచి నేరుగా రాజ్‌భవన్‌కు వచ్చారు. ఆ తరువాత పావుగంట వ్యవధిలో ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి రాజ్‌భవన్ చేరుకున్నారు. గవర్నరుతో ఇద్దరు ముఖ్యమంత్రులు 45 నిమిషాలు ఏకాంతంగా చర్చించారు. అనంతరం బిశ్వశర్మ రాంచీ వెళ్లిపోయారు. నవంబరులో పొరుగు రాష్ట్రం ఝార్ఖండ్‌లో ఎన్నికలు జరగనున్నాయి. భాజపా కేంద్రనాయకత్వం బిశ్వశర్మకు ఝార్ఖండ్ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా నియమించింది. గవర్నరు రఘుబర్ లోగడ ఝార్ఖండ్ ముఖ్యమంత్రిగా అయిదేళ్లు విధులు నిర్వహించారు. దీంతో రఘుబర్‌ను కలిసిన బిశ్వశర్మ, మోహన్‌లు పలు విషయాలు అడిగి తెలుసుకున్నట్లు సమాచారం.

సహకరిస్తే సుందర బ్రహ్మపుర..!



కాళ్లకు కర్రలు కట్టుకుని నృత్యం చేస్తున్న రాయల్ నృత్య అకాడమీ బాలికలు

బ్రహ్మపుర బజారు, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతలో ఆరోగ్యకరమైన జీవితం లభిస్తుందని వక్తలు సూచించారు. 'స్వచ్ఛతా హీ సేవా - 2024' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బ్రహ్మపురలోని మహాత్మాగాంధీ మైదానంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ముఖ్యఅతిథిగా బ్రహ్మపుర ఎమ్మెల్యే కె.అనిల్‌కుమార్, ఇతర అతిథులుగా మేయరు సంఘమిత్ర దొళాయి, ఉపమేయరు వివేక్‌రెడ్డి, కమిషనర్ భవానీప్రసాద్ మిశ్ర, ఉపకమిషనర్ ఆశీర్వాద్ పరిడా, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు. బ్రహ్మపురను సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని అతిథులు తెలిపారు. అనంతరం అంతా కలిసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం రాయల్ నృత్య అకాడమీ, ఉత్కళిక నృత్య సంస్థలకు చెందిన బాలికలు నృత్య ప్రదర్శన, త్రైక్వాండో క్రీడాకారుల విన్యాసాలు



ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్, మేయరు దొళాయి, కమిషనర్ మిశ్ర తదితరులు

ఇతర కార్యక్రమాలు అలరించాయి. గాంధీనగర్ ప్రైరోడ్డులో మేయరు దొళాయి, కమిషనర్ మిశ్ర, ఉపమేయరు వివేక్‌రెడ్డి తదితరులు చీపుర్లతో ఊడ్చి ర్యాలీ నిర్వహించారు. మధ్యాహ్నం బిజు పట్నాయక్ కల్యాణ మండపంలో రక్తదాన శిబిరం సైతం జరిగింది.

వెంకయ్యనాయుడి రాష్ట్ర పర్యటన



మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు రెండు రోజుల రాష్ట్ర పర్యటనకు శుక్రవారం భువనేశ్వర్ వచ్చారు. రాజ్‌భవన్‌లో విడిది చేసిన వెంకయ్యను గవర్నరు రఘుబర్ దాస్ స్వాగతించి పుష్పగుచ్ఛం అందజేశారు. పలు అంశాలపై ఇద్దరూ మాట్లాడుకున్నారు. అనంతరం సాయంత్రం సీఎం మోహన్ మాఝి వచ్చి కలిశారు.
–న్యూస్‌టుడే, భువనేశ్వర్,

వైద్య సిబ్బంది సమ్మె.. రోగులకు అవస్థలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: న్యాయమైన పది డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ది ఒడిశా నర్సింగ్ ఉద్యోగుల సంఘం శుక్రవారం నిరవధిక సమ్మెకు దిగింది. దీంతో బ్రహ్మపురలోని ఎమ్కేసీజీ వైద్య కళాశాల ఆసుపత్రిలో వైద్య సేవలకు అంతరాయం కలగడంతో రోగులు ఇబ్బందులు పడ్డారు. ఎమ్కేసీజీ వైద్య కళాశాల ఆసుపత్రి ఆవరణలో వందలాది మంది సేవలు నిలిపివేసి బైఠాయించడంతో వైద్యులపై తీవ్ర ఒత్తిడి పెరిగిందని ఎమ్కేసీజీ జూనియరు డాక్టర్ల సంఘం 2024-25 అధ్యక్షుడు అలోక్ దాస్ మధ్యాహ్నం ఒక ప్రకటనలో తెలిపారు. ఐసీయూ, అత్యవసర శస్త్ర చికిత్సలు, అత్యవసర చికిత్స విభాగం ఇతర వైద్య సేవల్లో సమ్మె ప్రభావం తీవ్రంగా ఉందన్నారు.



ఎమ్కేసీజీ ఆవరణలో బైఠాయించిన వైద్య సిబ్బంది

ఉత్తమ పాలనే మా ధ్యేయం

సమగ్రాభివృద్ధి ప్రభుత్వ అజెండా

అవినీతి, అక్రమాలపై ఉక్కు పాదం మోపుతామన్న సీఎం మోహన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఉత్తమ పాలన అందించడమే లక్ష్యమని, అవినీతి, అక్రమాలు ఏ స్థాయిలో జరిగినా క్షమించబోమని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి అన్నారు. భువనేశ్వర్ లోక్‌సేవాభవన్‌లో తొలిసారిగా జిల్లాల పాలనాధికారులు, ఎస్పీల సమావేశంలో మాట్లాడారు. తమ ప్రభుత్వం వంద రోజుల పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని తెలిపారు. ఈ ఏడాదిలో రూ.265 లక్షల కోట్ల బడ్జెట్ ఆమోదం పొందిన నేపథ్యంలో పథకాల అమలులో లోపాలుండవన్నారు. పారిశ్రామిక వ్యవసాయ, ఉత్పత్తుల రంగాలను పరుగులు తీయించాలన్న ధ్యేయంతో ఉన్నామన్నారు. అయిదేళ్లలో దేశంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో ఉంచే దిశగా కృషి చేస్తున్నామన్నారు.

హడావుడిగా పనులు చేయొద్దు

బడ్జెట్ కేటాయింపులు నిర్ణీత వ్యవధిలో ఖర్చవడం లేదని, చివరిదశలో పనులు జరుగుతుండటంలో నాణ్యతా ప్రమాణాలు లోపిస్తున్నాయన్నారు. సకాలంలో ఆయా రంగాలకు జరిగిన కేటాయింపులు వినియోగిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ప్రతి మూడు నెలలకోసారి జిల్లాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల ప్రగతి పరిశీలించాలన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు

దర్యాప్తు చేస్తాం

గత ప్రభుత్వం 5టీ పేరిట చేపట్టిన పనుల్లో ఎక్కడైనా నాణ్యత ఉందా? అంటూ ముఖ్యమంత్రి ప్రశ్నించారు. దీనికి నిలువెత్తు ఉదాహరణ పాఠశాలల భవనాలని తెలిపారు. పాత గోడలకు సున్నాలు, రంగులు వేయించి, డిజిటలైజేషన్ అంటూ నిధులు దుర్వినియోగం చేశారన్నారు. ఇలాంటి అవినీతి, అక్రమాలకు తాము సహించబోమన్నారు. గతంలో జరిగిన అవినీతి, అక్రమాలపై దర్యాప్తు జరుగుతుందని, ఎవరిని వదిలి పెట్టమని వెల్లడించారు.

కల్తీ మద్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి

కల్తీ మద్యం, మత్తు పదార్థాల విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరించాలన్నారు. అధికారులు ధాన్యం మండీలు, ఆసుపత్రులు, అందులోని చికిత్స సౌకర్యాలు, పాఠశాలల ఆకస్మిక తనిఖీలు చేయాలన్నారు. రెండు గంటల పాటు ప్రసంగించిన సీఎం ప్రభుత్వ లక్ష్యాన్ని వివరించారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రులు కనకవర్ధన్ సింగ్‌దేవ్, ప్రభాతి పరిడ, ఇతర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) మనోజ్ ఆహూజా, విభిన్న శాఖల ప్రిన్సిపల్ కార్యదర్శులు పాల్గొన్నారు. శనివారం మోహన్ ఎస్పీలకు దిశా నిర్దేశం చేయనున్నారు.



ఆ ఐఐసీ తీరు ఆవేదన కలిగించింది

★ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ముఖ్యమంత్రికి చేదు అనుభవం

★ కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో వెల్లడి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించక ముందు మోహన్ మాఝి కేంఝర్ ఎమ్మెల్యేగా ఉన్నారు. సార్వత్రిక ఎన్నికలకు సరిగ్గా నెల రోజులు ముందు ఆయన కేంఝర్‌లో ప్రజా ఆందోళనకు మద్దతు తెలిపారు. దాని విషయమై మాట్లాడేందుకు స్థానిక ఠాణాకు వెళ్లగా ఆ ఐఐసీ తనను బయటకు పొమ్మంటూ అగౌరవంగా మాట్లాడారు. ఈ ఘటన శుక్రవారం లోక్‌సేవా భవన్‌లో జరిగిన అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో ప్రస్తావించారు. ఆయన మాట్లాడుతూ.. 'ప్రజల తరపున మాట్లాడే ప్రజాప్రతినిధులకు కనీస మర్యాద ఇవ్వాలి. అహంకారంతో విచక్షణ లేకుండా మాట్లాడకూడదు. ఆ రోజు ఆయన ప్రవర్తించిన తీరు ఎంతో బాధించింది. ఈ రోజు నేను ముఖ్యమంత్రిని.. ఆయనను నేను ఏమైనా చేయగలను కానీ అది నా వ్యక్తిత్వం కాదు. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే అధికారులు నాయకులను గౌరవించాలి. స్టేషన్‌కు వచ్చేవారితో పోలీసులు స్నేహపూర్వకంగా మెలగాలి' అని హితబోధ చేశారు.

పొగాకు నివారణ పక్షోత్సవాల్లో రాష్ట్రం ఉత్తమ ప్రదర్శన



రాష్ట్రం తరఫున అవార్డు, ప్రశంసాపత్రాన్ని స్వీకరిస్తున్న నీలకంఠ, ఆరాధన

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా పలు ప్రదర్శనలు, కార్యకలాపాల్లో తరచూ ఏదో ఒక పురస్కారం అందుకుంటున్న మన రాష్ట్రానికి మరోసారి అరుదైన గౌరవం దక్కింది. ప్రపంచ పొగాకు నివారణ పక్షోత్సవ కార్యకలాపాలకు సంబంధించి దేశంలోనే అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన రాష్ట్రాల జాబితాలో ఒడిశా రెండో స్థానంలో నిలిచింది. గురువారం దిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రానికి ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. మన రాష్ట్రం తరపున జాతీయ ఆరోగ్యమిషన్ (ఎన్‌హెచ్‌ఎం) అదనపు కార్యదర్శి, సంచాలకుడు ఆరాధన పట్నాయక్ ప్రశంసా పత్రాన్ని అందుకోగా, ప్రజారోగ్య సంచాలకుడు నీలకంఠ మిశ్ర అవార్డు స్వీకరించారు. ఈ ఏడాది మే 20 నుంచి జూన్ 5 వరకు ప్రపంచ పొగాకు నివారణ పక్షోత్సవాలను నిర్వహించారు. జాతీయ నోటి ఆరోగ్యం, పొగాకు నివారణ వనరుల కేంద్రం,

జాతీయస్థాయిలో ఒడిశాకు రెండో స్థానం

మౌలానా ఆజాద్ దంత శాస్త్ర ఇన్‌స్టిట్యూట్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ సంయుక్తంగా రూపొందించిన మూల్యాంకనంలో రాష్ట్రం ఉత్తమ ప్రదర్శన కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచింది. యువత, విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతున్న పొగాకు నివారణకు రాష్ట్ర సర్కార్ అమలు చేస్తున్న వివిధ చర్యలను అతిథులు కొనియాడారు. ఈ ఏడాది నుంచి ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాల కోసం వచ్చే విద్యార్థులతో దరఖాస్తులపై పొగాకు వ్యతిరేక స్వీయ ప్రకటనను తప్పనిసరి చేయడాన్ని వేదికపై ప్రస్తావించారు.

60 రోజుల పాటు అవగాహన సదస్సులు

జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం కింద ఆరోగ్యశాఖ ఇప్పటికే 60 రోజుల పాటు అవగాహన సదస్సులు, చైతన్య కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇందులో భాగంగానే ఈ ఏడాది సెప్టెంబర్ 24 నుంచి మొదలు పెట్టిన కార్యక్రమాలు నవంబర్ 23 వరకు కొనసాగనున్నట్లు వెల్లడించాయి. విద్యా సంస్థల్లో ప్రవేశాల సందర్భంగా విద్యార్థుల నుంచి తీసుకున్న స్వీయ ప్రకటన (సెల్ఫ్ డిక్లరేషన్)లో విద్యార్థులు క్యాంపస్‌లో మత్తు పదార్థాలు, పొగాకు ఉత్పత్తులు కలిగి ఉండటం, వినియోగం, విక్రయం వంటివి పూర్తిగా నిషేధమని పొందుపరిచారు.

వేటకు వర్షం దెబ్బ



వరుస తుపానులు గంగపుత్రుడిని కష్టాల్లోకి నెట్టేసింది. సముద్రంపైనే ఆధారపడి జీవించే వీరంతా వేట లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. జులై నుంచి నవంబరు వరకు ప్రతి ఏడాది ఇవే అవస్థలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నవీన్ పట్నాయక్ ప్రభుత్వంలో వేట లేని సమయంలో ఎలాంటి జీవనభృతి ఇవ్వలేదని, భాజపా ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి ఇంత వరకు అమలు చేయలేదని వాపోయారు. శుక్రవారం వేట లేకపోవడంతో.. మత్స్యకారులు, వారి పడవలతో నిత్యం కళకళలాడే తీరం బోసిపోయిన ఈ చిత్రం గోపాల్‌పూర్ తీరంలో కనిపించింది.
–న్యూస్‌టుడే, గోపాలపూర్

గ్రామీణాభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా సప్తగిరి



రాయగడ, న్యూస్‌టుడే: గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖ అధ్యక్షుడిగా కొరాపుట్ పార్లమెంట్ సభ్యుడు సప్తగిరి ఉలక నియమితులయ్యారు. ఈ మేరకు పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ ఆదేశాలు జారీ చేసినట్లు ఉలక శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం తనకు కీలక బాధ్యతలు అప్పగించిందని, తప్పక న్యాయం చేస్తానని ఆయన పేర్కొన్నారు. పీసీసీ రాష్ట్ర కార్యదర్శి దుర్గా ప్రసాద్ పండా, కాంగ్రెస్ కార్యకర్తలు ఉలకను అభినందనలు తెలిపారు. రాయగడలో విమానాశ్రయం ఏర్పాటు, జయపురం విమానాశ్రయం విస్తరణ పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావించగా, ఆ శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సానుకూలంగా స్పందించినట్లు ఉలక పేర్కొన్నారు.

రేషన్ దుకాణాల్లో గోధుమలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రేషన్ దుకాణాల్లో అక్టోబరు నుంచి బియ్యంతో పాటు గోధుమలు పంపిణీ చేయనున్నారు. కేంద్రం అమలు చేస్తున్న పీఎం అన్న యోజన కింద గతంలో బియ్యం మాత్రమే అందజేయాలని నవీన్ ప్రభుత్వం డిమాండ్ చేయడంతో అది మాత్రమే ఇచ్చేవారు. ఇప్పుడు భాజపా ప్రభుత్వం రావడంతో గోధుమలు కూడా అందజేయనున్నారు. త్వరలోనే రాష్ట్రానికి సరకు రానుందని ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి కృష్ణచంద్ర పాత్ర్ తెలిపారు.

మరో ముగ్గురికి పాలీగ్రాఫ్ పరీక్షలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని భరత్‌పూర్ ఠాణా ఘటనలో మరో ముగ్గురికి పాలీగ్రఫీ పరీక్షలకు భువనేశ్వర్ ఎస్‌డీజేఎం న్యాయస్థానం శుక్రవారం అనుమతించింది. ఈ నెల 17న రాత్రి రక్షణ శాఖ అధికారి, అయన స్నేహితురాలిపై భరత్‌పూర్ ఠాణా ఐఐసీ దీనకృష్ణమిశ్ర, ఇద్దరు మహిళా ఎస్సైలు, ఏఎస్సైలు దుర్భాషలాడి చేయిచేసుకున్నారన్న ఆరోపణపై క్రైంబ్రాంచ్ దర్యాప్తు చేస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై ప్రభుత్వం న్యాయవిచారణకు ఆదేశించింది. ఈ ఘటనలో అయిదుగురు పోలీసులు సస్పెండయ్యారు. వాస్తవాలు తెలుసుకునేందుకు క్రైంబ్రాంచి తొలుత ఐఐసీకి పాలీగ్రాఫ్ పరీక్ష చేయించేందుకు న్యాయస్థానం అనుమతి కోరింది. ఈ నేపథ్యంలో పరీక్షలు అంగీకరించింది.

చేతబడి అనుమానంతో వెలి

న్యాయం చేయాలని బాధిత కుటుంబం ఆవేదన




ఠాణా ఎదుట సర్గిగుడ గ్రామస్థులు

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: ప్రపంచమంతా ఆధునికతతో ముందుకెళ్తున్న ఈ కాలంలో మారుమూల గ్రామాల్లో అంధవిశ్వాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఆరు నెలల క్రితం చేతబడి చేశారనే నెపంతో ఓ కుటుంబాన్ని గ్రామస్థులు వెలివేశారు. తమకు గ్రామంలో ఆవాసం కల్పించాలని కోరుతూ బాధితులు గురువారం ఠాణాలో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. కొరుకొండ సమితి సర్గిగుడ గ్రామంలో భక్తరాం హంతాల్, భార్య గౌరీ హంతాల్, కుమారులు ధనపతి, గోపినాథ్, కుమార్తె నైనా కలిసి ఉంటున్నారు. ఆయనకు గ్రామంలో ఉన్న ఏడెకరాల పొలం, పశువులతో కుటుంబ పోషణ చేసుకుంటున్నాడు. ఆరు నెలల క్రితం గ్రామానికి చెందిన ఇద్దరు అనారోగ్యంతో మృతి చెందారు. భక్తరాం చేతబడి చేయడంతోనేమృతి చెందారని, అనుమానించి, ఆయన కుటుంబాన్ని గ్రామస్థులు వెలివేశారు. దాంతో గ్రామం విడిచి వెళ్లిపోయారు. ఇటీవల న్యాయవాది గోవింద్ పాత్ర్‌ను కలిసి, ఆయన సలహా మేరకు కొరుకొండ ఠాణాలో ఫిర్యాదు చేయగా ఠాణా అధికారి హిమాంశు బారిక్, గ్రామస్థులు, బాధితులతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. చేతబడి నెపంతో ఊరి నుంచి వెలివేయలేదని, గ్రామ ప్రజలు పూజలు చేస్తున్న అమ్మవారి పీఠం వద్ద భక్తరాం, ఆయన కుటుంబ సభ్యులు రోజూ చెత్త వేసి అపరిశుభ్రం చేస్తుండటంతో పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదని గ్రామ పెద్ద వెల్లడించారు. దీంతో జరిమానా విధించగా ఊరు విడిచి వెళ్లిపోయారన్నారు. వారు గ్రామంలో ఉండటానికి అభ్యంతరం లేదని, సక్రమంగా ఉండాలని చెప్పారు.

సుందర ప్రాంతం తీర్చిదిద్దితే పర్యాటక శోభితం

కొరాపుట్ జిల్లా పర్యాటక ప్రాంతాలకు పెట్టింది పేరు. ఇక్కడి ప్రకృతి అందాలు ఎంత చూసినా తనివి తీరదు. కానీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండిపోయాయి. కనీస సదుపాయాలు, సరైన రహదారి మార్గాలు లేవు. అధికారులు, ప్రజా ప్రతినిధులు అభివృద్ధి చేసేందుకు చొరవ చూపడం లేదు. – న్యూస్‌టుడే, సిమిలిగుడ




ఆకట్టుకుంటున్న ప్రకృతి

సిమిలిగుడ సమితి దుదారి గ్రామం సమీపంలో ఉన్న జలపాతం అందాలు అందరినీ కట్టి పడేస్తున్నాయి. చుట్టూ పచ్చని చెట్లు, అబ్బురపరిచే మేఘాలు, కొండల నడుమ జాలువారే జలపాతం స్వర్గాన్ని తలిపించే అందాలు పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. దుదారికి వెళ్లే మార్గంలో కాఫీ తోటలు, పచ్చని పొలాలు, దేవ్‌మాలి పర్వత సోయగాలు కనువిందు చేస్తున్నాయి. ఇంతటి సుందరదృశ్యాలు గల ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోక పోవడం శోచనీయం. సరైన రహదారి లేకపోవడంతో పర్యాటకులు అక్కడకు చేరుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

దుదారిపై అధికారుల శీతకన్ను

నిత్యం జల సవ్వడులు

జలపాతంలో ఏడాది పాటు నీరు ప్రవహిస్తుండడం గమనార్హం. వేసవిలోనూ నీరు తగ్గుముఖం పట్టదు. ఈ ప్రదేశం వనభోజనాలకు చక్కటి వేదిక. నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు పర్యాటకుల సందడి ఎక్కువగా ఉంటుంది. సిమిలిగుడ నుంచి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామం వద్ద పురాతన మౌళి మందిరం ఉంది. ఇది ఎంతో ప్రత్యేకత కలది. ఇక్కడి దేవతామూర్తుల విగ్రహాలు అద్భుతంగా ఉంటాయని, జయపురం రాజ వంశీయులు ఈ మందిరంలో పూజలు చేస్తుండేవారని ఇక్కడివారు చెబుతున్నారు. శివరాత్రి, దసరా పర్వదినాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రాంతాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా గుర్తించాలని స్థానికులు కోరుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పొట్టంగి శాసనసభ్యుడు రామచంద్ర కడం మాట్లాడుతూ.. గత ప్రభుత్వం దీనిపై దృష్టి సారించలేదని, పర్యాటక శాఖాధికారులతో మాట్లాడి అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



రాళ్ల మధ్య జలసవ్వడి

శుద్ధజలం అందించండి



బ్రహ్మపుర శివారులోని గోవింద్ విహార్, ఖారవేలనగర్ వాసులు శుద్ధజలం లభించక నానా ఇబ్బందులు పడుతున్నారని బ్రహ్మపుర సహకాశాలి అంచలిక మిలిత క్రియానుస్థాన ఆవేదన వ్యక్తం చేసింది. కమిటీ అధ్యక్షుడు సంజీబ్ కుమార్ పట్నాయక్ నాయకత్వంలో శుక్రవారం పలువురు ప్రతినిధులు బ్రహ్మపుర సబ్‌కలెక్టరు కార్యాలయం బయట నిరసన తెలిపారు. జానిబిలి తాగు నీటి పథకం కింద ఆయా ప్రాంతాలకు కుళాయిలు వేసినా.. నీరు సరఫరా కావడంలేదన్నారు. సబ్‌కలెక్టరు కార్యాలయానికి వినతి పత్రాన్ని అందజేశారు. శివప్రసాద్ మిశ్ర, టి.సుదేశ్ కుమార్ పాత్ర్, దినబంధు సామంతరాయ్, శ్రీకాంత్ పాడిహారి, అజిత్ పట్నాయక్, ఎం. లావణ్య పాత్ర్, కాళించరణ నాయక్, లక్ష్మీకాంత పండా, ఆదిత్య నారాయణ రథ్ తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, బ్రహ్మపుర నగరం

మావోయిస్టుల చేతిలో గిరిజనం ఛిన్నాభిన్నం

● వ్యతిరేక పోస్టర్ల కలకలం

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మావోయిస్టుల వలలో చిక్కుకుని గిరిజనం ఛిన్నాభిన్నమవుతోంది. మల్కాన్‌గిరి జిల్లా మత్తిలి, కలిమెల, చిత్రకొండ సమితుల్లో పలు చోట్ల శుక్రవారం మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు వెలుగుచూశాయి. స్వతంత్ర కోరాపుట్ జిల్లా గిరిజన భద్రతా కమిటీ రాసినట్లు వాటిలో ఉంది. జిల్లాలో ఎన్నో ఏళ్లుగా యువతీయువకులు మావోయిస్టు సంఘంలో చేరుతూ అనేక అవస్థలు పడుతున్నారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర అడవుల్లో దుర్భరమైన ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఆయా రాష్ట్రాల్లో జవానులకు, మావోయిస్టులకు జరుగుతున్న కాల్పుల ఘటనల్లో చాలామంది గిరిజనులు ప్రాణాలు కోల్పోతున్నారు. సంఘంలోని నాయకులు ఆదివాసీలు, వెనుకబడిన కులాల వారిని మభ్యపెట్టి సంఘంలో చేర్చుకుంటున్నారు. వారి చేత వెట్టిచాకిరీ చేయించుకుని నిలువు దోపిడీ చేస్తున్నారు. ఆంధ్రా, ఒడిశా ప్రాంతీయ కార్యదర్శి ఉదయ్, మరి కొంతమంది సహచర గిరిజన బాలికలపై తప్పుడు కేసులు పెట్టి, ఆమెపై సామూహిక అత్యాచారం చేసి హతమార్చారని దారుణం. జవానులు మావోయిస్టు క్యాంపు నుంచి గర్భనిరోధక మందులు స్వాధీనం చేసుకోవడం గమనార్హం. మావో సంఘం పేరుతో చేస్తున్న నేరాలు గిరిజనులు తెలుసుకుని సమాజంలో కలిసిపోవాలని, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని పోస్టర్లలో రాసి ఉంది. యువతి, యువకులను విడిచి పెట్టకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని అందులో పేర్కొన్నారు.



చెట్టుకు అతికించిన పోస్టర్

అంతిమయాత్రకు అవస్థలు

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రాయిఘర్ సమితి ముండిగూడ పంచాయతీ తాలపాదర గ్రామం, ఉమ్మర్‌కోట్ సమితి తొహరా పంచాయతీ మధ్య వాన్నిల్ నదిపై ఉన్న వంతెన ధ్వంసమైంది. దీంతో తాలపాదర, తేలపర, కుడుముదర, రామపురా గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం తాలపాదరకు చెందిన పింటు శాంతా (58) మృతి చెందారు. మృతదేహాన్ని శ్మశానానికి తీసుకెళ్లేందుకు గ్రామస్థులు అవస్థలు పడ్డారు. అధికారులు స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.



పట్టించుకునేవారేరీ..?



గోపాల్‌పూర్ తీరం స్వర్గధార్ పార్కు ఆవరణలో దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహం శిథిలావస్థకు చేరుకుంది. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోవడం లేదని, విగ్రహం రంగు వెలిసి, రంధ్రాలు కనిపిస్తున్నాయని స్థానికులు తెలిపారు. పార్కులో మాజీ ప్రధాని విగ్రహం చూసి పర్యాటకులు అసంతృప్తి, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను ఎన్‌ఏసీ కార్యనిర్వహణాధికారి మానస్ రంజన్ మల్లిక్ వద్ద ప్రస్తావించగా త్వరలో జరగనున్న కౌన్సిల్ సమావేశంలో చర్చించి మరమ్మతులు చేస్తామన్నారు. - న్యూస్‌టుడే, గోపాల్‌పూర్

పర్యాటక రంగాన్ని పరిరక్షించాలి

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పర్యాటక రంగాన్ని పరిరక్షించాలని అదనపు పాలనాధికారి రాజేంద్ర మింజ్ అన్నారు. శుక్రవారం పాలనాధికారి కార్యాలయంలోని సమావేశ భవనంలో ఏర్పాటుచేసిన ప్రపంచ పర్యటక దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పర్యటక రంగం అభివృద్ధి చెందితే సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక రంగాలు కూడా వృద్ధి చెందుతాయన్నారు. పర్యాటక ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని, ప్లాస్టిక్ వాడకం తగ్గించాలన్నారు. జిల్లా పర్యాటకశాఖ అధికారి అరుణ్ కుమార్ త్రిపాఠి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 16 పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సాంస్కృతిక విభాగం అధికారి అర్చన కుమారి మంగరాజ్, జిల్లా సామాజిక భద్రత శాఖ అధికారి సంతోష్ కుమార్ నాయక్, డిప్యూటీ కలెక్టర్ కమలాకాంత్ పండా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు పాలనాధికారి రాజేంద్ర మింజ్, వేదికపై ఇతర అధికారులు

మోహన్ నాయక్‌కు నివాళి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: దళిత నాయకుడిగా రాజకీయవేత్తగా విశేష సేవలు అందించిన దివంగత మోహన్ నాయక్ సదా స్మరణీయుడని వక్తలన్నారు. మోహన్ నాయక్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం బ్రహ్మపుర హాడికూడా మహాసంఘం, దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కూడలిలోని నాయక్ విగ్రహానికి ఎమ్మెల్యే కె.అనిల్ కుమార్, బీఈఎంసీ మేయరు సంఘమిత్ర దొళాయి, ఉప మేయరు ఈ.వివేక్ రెడ్డి, కమిషనర్ భవానీ ప్రసాద్ మిశ్ర, బీఈడీఏ మాజీ అధ్యక్షుడు సుభాష్ మహరణా తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



మోహన్ నాయక్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మేయరు దొళాయి, కమిషనర్ భవానీ మిశ్ర తదితరులు

ఇద్దరు నిందితులకు ఉరిశిక్ష

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ముగ్గురి హత్య చేసిన కేసులో ఇద్దరు నిందితులకు ఆనందపూర్ ఏడీజేఎం న్యాయస్థానం శుక్రవారం ఉరిశిక్ష విధించింది. 2017లో అనుగుల్ జిల్లా కిశోర్‌నగర్ ఠాణా పరిధిలోని గంజారిబాబిలా గ్రామంలో ప్రకాష్ బెహర, నందకిశోర్ శేఠిలు ఒక తగాదాకు సంబంధించి భార్యాభర్తలతో పాటు నాలుగేళ్ల బాలుడిని హతమార్చారు. దర్యాప్తు చేసిన కిశోర్‌నగర్ పోలీసులు న్యాయస్థానంలో వీరిద్దరిపై ఛార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ చేసిన కోర్టు నిందితులకు శిక్ష ఖరారు చేసింది.

బాలుడి జల సమాధి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: బాలేశ్వర్ జిల్లా ఆస్తి పంచాయతీలోని నర్జాపాటియా గ్రామంలో శుక్రవారం సాయంత్రం స్నానానికి దిగిన బాలుడు మునిగిపోయాడు. ఇద్దరు స్నేహితులతో కలిసి తాపస్ రౌత్ సువర్ణరేఖ నదికి వెళ్లాడు. అందులో దిగి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. మిగతా ఇద్దరిని స్థానికులు కాపాడగా తాపస్ మృతి చెందాడు.

మహిళ బలవన్మరణం

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా జోరిగాంవ్ ఠాణా పరిధి పోటగూడ గ్రామంలో ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన మేనక దాస్ (35) శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో స్థానికులు తలుపులు విరగొట్టి చూడగా ఉరేసుకుంది. ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పరీక్ష అనంతరం మృతదేహాన్ని పోలీసులు కుటుంబసభ్యులకు అప్పగించారు.

కుమారుడిని కాపాడబోయి.. విద్యుదాఘాతంతో తండ్రి మృతి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా బడగడ ఠాణా పరిధిలోని గునాఖాళి గ్రామంలో శుక్రవారం విద్యుదాఘాతం నుంచి కుమారుడిని కాపాడబోయిన తండ్రి టుటు గౌడ (25) మృతిచెందగా, బలరామ్ గౌడ అనే బంధువు గాయపడ్డాడు. ఇంటి ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభం వద్ద ఓ విద్యుత్ తీగ వేలాడుతోంది. టుటు రెండేళ్ల కుమారుడు ఆ స్తంభంవైపు వెళుతుండగా, టుటు, బలరామ్‌లు గమనించారు. బాలుడిని కాపాడే ప్రయత్నంలో ఇరువురికీ తీగ తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యారు. కుటుంబ సభ్యులు బడగడ ఆరోగ్య కేంద్రంలో చేర్పించగా, అప్పటికే టుటు మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గాయపడ్డ బలరామ్ చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పరీక్షకు తరలించారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

జయపురం, న్యూస్‌టుడే: జయపురం సమితి సౌరా చౌక్ వద్ద ఒక కారు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. గాయపడిన వారిని స్థానికులు జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం ఓ కారు కుంద్ర నుంచి జయపురానికి వస్తుండగా ప్రమాదం జరిగింది. పూర్తి వివరాలు తెలియరాలేదు.

చోరీ చరవాణులు యజమానులకు అందజేత

ఝార్‌గ్రామ్, న్యూస్‌టుడే: ఝార్‌గ్రామ్ పోలీసులు చోరీ చరవాణులను శుక్రవారం యజమానులకు అందజేశారు. జిల్లాలో చరవాణులు చోరీకి గురవడంతో బాధితులు ఠాణాలో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 183 చరవాణులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని యజమానులకు అందజేసినట్లు పోలీసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్పీ అరిజిత్ సిన్హా, అదనపు ఎస్పీ(హెడ్‌క్వార్టర్) సయ్యద్ మహమ్మద్ ముల్లా హుస్సేన్, అదనపు ఎస్పీ (ఆపరేషన్) గులాం సర్వర్ పాల్గొన్నారు.



చరవాణి అందజేస్తున్న అరిజిత్ సిన్హా

ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉంటాం



మాట్లాడుతున్న రబినారాయణ్ మిశ్ర

రాయగడ, న్యూస్‌టుడే: ఉత్కళ్ అల్యూమినా పరిశ్రమ కేవలం వాణిజ్య దృక్పథం మాత్రమే కాదని, ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి(సీఈవో) రబి నారాయణ మిశ్ర అన్నారు. శుక్రవారం తేజస్వ సమావేశ భవనంలో పాత్రికేయుల ఆత్మీయ కలయికలో ఆయన పాల్గొన్నారు. పరిశ్రమ నిర్వహిస్తున్న విద్యాసంస్థలు, ఆసుపత్రులు, అంబులెన్స్ సేవలు, ఉపాధి కల్పన తదితరాలను వివరించారు. పరిశ్రమ ఆధ్వర్యంలోని టికిరిలో నడుస్తున్న ఆసుపత్రిలో రోజుకు 200 మందికి వైద్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం చేపడుతున్న పలు కార్యక్రమాలకు సాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తన్మయ్ మిశ్ర, పీతాంబర్ బెహర పాల్గొన్నారు.

గవర్నరుతో రక్షణశాఖాధికారి భేటీ

రక్షణశాఖాధికారి లెఫ్టినెంట్ జనరల్ అనింద్యసేన్ గుప్తా భువనేశ్వర్ వచ్చారు. శుక్రవారం ఉదయం రాజ్‌భవన్‌లో గవర్నరు రఘుబర్ దాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గుప్తాకు గవర్నర్ జ్ఞాపిక అందజేశారు. - న్యూస్‌టుడే, భువనేశ్వర్



ఓపీఎస్సీ అధ్యక్షుడిగా అరుణ్ షడంగి



అరుణ్ షడంగి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: సీనియర్ ఐపీఎస్ అధికారి అరుణ్ షడంగి ఒడిశా పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఓపీఎస్సీ) అధ్యక్షునిగా శుక్రవారం సాయంత్రం నియమితులయ్యారు. ఓపీఎస్సీ అధ్యక్షుడిగా ఆయన విధులు నిర్వహిస్తారని ప్రకటించారు. లోగడ ఇన్‌ఛార్జ్ డీజీగా విధులు నిర్వహించిన అరుణ్ ప్రస్తుతం బిజుపట్నాయక్ పోలీస్ అకాడమీ సంచాలకుడిగా ఉన్నారు. సమర్థ అధికారిగా నిరూపించుకున్న ఆయనకు ప్రభుత్వం కీలక పదవి కేటాయించింది.

తాగునీటి సౌకర్యం కల్పించండి

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లా రాయగడ సమితి ఎస్ కరడా సింగ్, లైలై పంచాయతీలో సన్నలోబ, జిరాంగో, కరణసాహి, ఓబ్బపూర్ గ్రామాల ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతన్నారు. వీరు శుక్రవారం గ్రామీణ నీటి సరఫరాల శాఖ కార్య నిర్వహణ ఇంజినీర్ రాజేష్ కుమార్ నాయక్‌ను కలిసి సమస్య వివరించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన అధికారి వారం రోజుల్లో సమస్య పరిష్కరించి నీటి కష్టాలు తీరుస్తామన్నారు.

'సహనీ కప్' ఫుట్‌బాల్ పోటీలు

● తలపడుతున్న 32 జట్లు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: ఒడిశా ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ చోట్ల 'సహనీ కప్-2024' పేరిట నిర్వహిస్తున్న 63వ సీనియర్ పురుషుల అంతర్‌జిల్లా ఫుట్‌బాల్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. బరగఢ్, సుందర్‌గఢ్, పరదీప్, బరిపదల వేదికగా జరుగుతున్న ఇందులో బరగఢ్, సంబల్‌పూర్, కేంఝర్, మల్కాన్‌గిరి, కొంధమాల్, కలహండి, నువాపడ, బొలంగీర్, సుందర్‌గఢ్, నవరంగపూర్, నయాగఢ్, గజపతి, ఝూర్సుగుడ, సోన్‌పూర్, రవుర్కెలా ఉక్కుప్లాంట్, కొరాపుట్, కటక్, గంజాం, జగత్సింగ్‌పూర్, పూరీ, ఖుర్దా, భువనేశ్వర్, పరదీప్, కేంద్రపడ, బౌద్ధ్, మయూర్‌భంజ్, భద్రక్, అనుగుల్, బాలేశ్వర్, దేవగఢ్, జాజ్‌పూర్, ఢెంకనాల్ జట్లు తలపడుతున్నాయి. ఆయా చోట్ల గురువారం జరిగిన మ్యాచులలో పూరీ, కటక్, భువనేశ్వర్, సోన్‌పూర్, రవుర్కెలా, దేవగఢ్, ఢెంకనాల్, కలహండి జట్లు గెలుపొందాయి.

● బిహార్ రాజధాని పట్నాలో 28వ తేదీ నుంచి 30 వరకు జరగనున్న నాలుగో భారత ఆహ్వాన అండర్-23 అథ్లెటిక్స్ పోటీలకు పది మంది రాష్ట్ర క్రీడాకారులు సిద్ధమయ్యారు. వీరంతా పట్నాకు బయలుదేరి వెళ్లారు.

● రవుర్కెలాలో జరిగిన రెండో రాష్ట్ర హాకీ సీనియర్ మహిళా విజేతగా ఒడిశా సచివాలయం జట్టు నిలిచింది. ఇందులో తుదిపోరులో సచివాలయం, సుందర్‌గఢ్‌లు తలపడగా నిర్ణీత సమయంలో ఇరు జట్లు ఒక్క గోల్ కూడా కొట్టలేదు. చివరిగా షూటావుట్‌లో సచివాలయం జట్టు క్రీడాకారిణులు 3-2 గోల్స్‌తో గెలుపొంది ఛాంపియన్ బహుమతిని కైవసం చేసుకున్నారు.

● ఉత్తరాఖండ్‌లో ఈనెల 21 నుంచి 26 వరకు జరిగిన 33వ జాతీయ సీనియర్ ఉషు పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు పతకాలు దక్కించుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర క్రీడావిభాగం 'ఎక్స్'లో ఆ వివరాలు వెల్లడించింది. పోటీల్లో క్రీడాకారులు రెండు పసిడి, ఒక రజతం, మూడు కాంస్య పతకాలు గెలుచుకున్నట్లు అందులో పేర్కొంటూ విజేతలకు అభినందనలు తెలిపింది.

ఉద్యోగోన్నతి కల్పించాలంటూ ఆందోళన

పర్లాఖెముండి, గుణుపురం, జయపురం, మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: నర్సులకు ఉద్యోగోన్నతి కల్పించాలంటూ ఒడిశా నర్సింగ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నర్సులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఆయా ప్రాంతాల్లో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. తమ పది డిమాండ్లు పరిష్కరించాలని కోరారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నర్సులు



గుణుపురంలో..



జయపురం..



మల్కాన్‌గిరి..

మూడో రోజుకు చేరిన సమ్మె

భువనేశ్వర్, న్యూస్‌టుడే: వైద్య సిబ్బంది సమ్మె శుక్రవారం మూడో రోజుకు చేరింది. దీంతో సేవలు స్తంభించాయి. ఆరోగ్యశాఖ మంత్రి ముఖేష్ మహాలింగ ముగ్గురు ఉన్నతాధికారులతో గురువారం రాత్రి ఒక సంఘం ఏర్పాటు చేసి వారి డిమాండ్లు పరిశీలించి నివేదిక సమర్పించాలని ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ... ప్రభుత్వం న్యాయం చేసేందుకు సిద్ధంగా ఉందని, సమ్మె వీడి విధులకు హాజరవ్వాలని కోరారు.

పర్యాటక కేంద్రాలకు నూతన సొబగులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ప్రముఖ పర్యటక కేంద్రాలకు సరికొత్త సొబగులు అద్దుతామని పర్యాటకశాఖ బాధ్యతలు పర్యవేక్షిస్తున్న ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం భువనేశ్వర్‌లోని ధౌళి బౌద్ధారామం నుంచి కోణార్క్ శిల్ప కళారామం వరకు ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించగా జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో నటుడు, ఎమ్మెల్యే సిద్ధాంత్ మహాపాత్ర తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఎమ్మెల్యే

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: భాజపా బ్రహ్మపుర ఆధ్వర్యంలో 'సేవ, సమర్పణ అభియాన్ కింద సేవా పక్షోత్సవాల నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఈ సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. స్థానిక గుసానినువాగాం ఓంనగర్‌లోని షిరిడీ సాయి మందిరం ప్రాంతలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిల్ కుమార్ పాల్గొని మొక్కలు నాటారు.

స్వచ్ఛభారత్.. సిమిలిగుడ: అందరం పరిశుభ్రత పాటిస్తామని అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రతిజ్ఞ చేశారు. పొట్టంగి సమితి కేంద్రంలో ప్రపంచ పర్యటక దినోత్సవం సందర్భంగా శుక్రవారం దేవ్‌మాలి పర్వతంపై కార్యక్రమం నిర్వహించారు. సమితి అధ్యక్షురాలు కల్పన పంగి, సమితి అభివృద్ధి అధికారి సుఖంత్ కుమార్ పట్నాయక్, జిల్లా పరిషత్ సభ్యురాలు తికయి గమేల్, అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ సౌమేంద్ర నాయక్ పాల్గొన్నారు.

పర్లాఖెముండి: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గుసాని సమితి గురండి సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో చెత్తా చెదారం, పనికిరాని మొక్కలు తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో వైద్యులు, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలిజాతర.. కొరాపుట్: జిల్లాలోని గిరి గ్రామాల్లో బాలి జాతర సందడి నెలకొంది. శుక్రవారం మలిగుడ గ్రామంలో అమ్మవారి ప్రతరూపంగా లారిని ఊరేగించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఏడాది ఎటువంటి ఆటంకాలు రాకుండా, పంటలు బాగా పండాలని, అందర్నీ చల్లగా చూడాలని వేడుకున్నారు.

● **భువనేశ్వర్:** బాలేశ్వర్ జిల్లా నీలగిరి ఎన్‌ఏసీ అధ్యక్షుడు అంబికాదాస్ శుక్రవారం జరిగిన అవిశ్వాస తీర్మానంలో ఓటమి పాలయ్యారు. 13 మంది కౌన్సిలర్లు ఉన్న ఈ ఎన్‌ఏసీలో 10 మంది అంబికాకు వ్యతిరేకంగా ఓట్లేశారు.

● **గుణుపురం:** రాయగడజిల్లా రామన్నగుడ సమితిలోని పలు గ్రామాల్లో డిజిటల్ మీటర్లు ఏర్పాటు చేసి అధిక బిల్లులు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ సురక్షా మంచ్ నాయకులు గురువారం నిరసన చేపట్టారు. సీఎం పేరిట రాసిన వినతి పత్రాన్ని తహసీల్ కార్యాలయంలో గుమస్తాకు అందజేశారు.

ముహూర్తపు రాట... రాయగడ: స్థానిక న్యూ కాలనీలో గజలక్ష్మి ఉత్సవాల కోసం శుక్రవారం ముహూర్తపు రాట వేశారు. వచ్చేనెల 16 నుంచి 27వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ త్రినాథ్ రావు, సవ్యసాచి సాహు, దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● **నవరంగపూర్, జయపురం:** నవరంగపూర్, జయపురంలో దసరా సందడి మొదలైంది. ఆయా ప్రాంతాల్లో ఉత్సవాలు నిర్వహించేందుకు సర్వాంగ సుందరంగా మండపాలు ఏర్పాటు చేస్తున్నారు. పలు చోట్ల శుక్రవారం నుంచి పూజలు ప్రారంభించారు. పపదహండి సమితిలో రెండు మండపాలకు దాదాపు రూ.50లక్షలు వెచ్చించినట్లు నిర్వాహకులు తెలిపారు.

రైల్వే స్టేషన్లలో ఆహార నాణ్యత పరిశీలన

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: రైల్వే అధికారులు ఆహార నాణ్యతపై గురువారం తనిఖీలు నిర్వహించారు. స్వచ్ఛత ఆహార్ కార్యక్రమంలో భాగంగా ఖరగ్‌పూర్ డివిజన్‌లోని పలు స్టేషన్లలోని స్టాళ్లలో తనిఖీలు చేసినట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖరగ్‌పూర్, మిడ్నాపూర్ షాలిమార్, సంత్రగాచి, బాలేశ్వర్ స్టేషన్లతో పాటు గీతాంజలి సూపర్ ఫాస్ట్ రైలు, పూణే-దురంతో, సికింద్రాబాద్-పలక్‌నామా రైళ్లలో తనిఖీలు చేశారు.

అంగన్‌వాడీ కార్యకర్తను తొలగించాలి

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తను తొలగించాలని గజపతి జిల్లా గుమ్మ సమితి తరంగడ పంచాయతీ లుంగు గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పాలనాధికారి కార్యానికి చేరుకుని జిల్లా శిశు సంక్షేమాధికారి మనోరమ దేవికి వినతి పత్రం అందజేశారు. తమ గ్రామానికి చెందిన ప్రతిమ గమాంగ్ ఈ ఉద్యోగానికి అర్హురాలైనా ఎంపిక చేయలేదని, పక్క గ్రామానికి చెందిన జోష్మిత రైత్‌కు ఇవ్వడం సమంజసం కాదన్నారు. ఆ ఉద్యోగం ప్రతిమకు ఇవ్వాలని కోరారు.



పాలనాధికారి కార్యాలయం ఎదుట గ్రామస్థులు

అంకితభావంతో వైద్య సేవలందించాలి

సిమిలిగుడ, గుణుపురం, న్యూస్‌టుడే: వైద్యులు అంకిత భావంతో వైద్య సేవలందించాలని అతిథులన్నారు. రాయగడ జిల్లా చంద్రపూర్ సమితి, కొరాపుట్ సమితి మతల్‌పుట్‌లలో శుక్రవారం రోగి కళ్యాణ సమితి సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే రామచంద్ర కడం, ఆరోగ్య కేంద్రం ముఖ్య వైద్యాధికారి సుమన్ తప్పో, బీపీఎం నూతన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. చంద్రపూర్‌లో ఎమ్మెల్యే సత్యజిత్ గమాంగ్, రామన్నగుడ సమితి అధక్షులు రవిశంకర్ గమాంగ్ పాల్గొన్నారు.



వైద్యులు వైద్య సిబ్బందితో ఎమ్మెల్యే కడ్మ

రక్తదాన శిబిరం

సిమిలిగుడ, రాయగడ, న్యూస్‌టుడే: సిమిలిగుడకు చెందిన లివ్‌ఫర్ అదర్స్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సునాబెడ పురపాలక అధ్యక్షుడు రాజేంద్ర కుమార్ పాత్ర్ ప్రారంభించారు. జిల్లా రక్తనిధి అధికారుల పర్యవేక్షణలో 38 మంది రక్తదానం చేశారు. సంస్థ అధ్యక్షురాలు స్నిగ్ధ రాణి మిశ్రా, భాజపా నేత చైతన్య నంది వాలి, చిత్తరంజన్ మిశ్రా, సునీల్ తదితరులు పాల్గొన్నారు. ● రాయగడలోని రామలింగేశ్వర ఆలయ కళ్యాణ మండపంలో ఫ్రెండ్స్ వాకర్స్ క్లబ్ నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎస్పీ బిష్ణు పాత్రో ప్రారంభించారు. ఇందులో 35 యూనిట్లు రక్తం సేకరించారు. క్లబ్ అధ్యక్షుడు ఎల్ చంద్రశేఖర్, కార్యదర్శి ఎల్ ఎం రావు, కోశాధికారి కె శ్రీధర్ పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న వ్యక్తులు



రాయగడలో..



తీరంలో వ్యర్థాల సేకరణ

గోపాలపూర్, న్యూస్‌టుడే: ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం గోపాల్‌పూర్ తీరంలో పర్యటక శాఖ ఉద్యోగులు, సిబ్బందితోపాటు విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తీరంలో వ్యర్థాలు తొలగించారు. బీచ్‌రోడ్‌లో ర్యాలీ నిర్వహించి, తీరాన్ని పరిశుభ్రంగా ఉంచుదామని, ప్లాస్టిక్ వ్యర్థాలు వేయమని నినాదాలు చేశారు.

మంత్రికి వినతి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘం సభ్యులు

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా ఉత్కళ ఉపాధ్యాయ సంఘం శుక్రవారం విద్యాశాఖమంత్రి నిత్యానంద్ గొండొకు వినతిపత్రం అందజేశారు. జీతాలు పెంచాలని, తమను మధ్యాహ్న భోజన పథకం నుంచి తొలగించాలని, 2006 నుంచి పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని తదితర 15 డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి రంజన్ కుమార్ బెహరా తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరం

గుణుపురం, కొరాపుట్, న్యూస్‌టుడే: గుణుపురం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక వేంకటేశ్వర కల్యాణ మండపంలో శుక్రవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీకాకుళంలోని మెడికవర్ ఆసుపత్రి వైద్యులు 150 మందికి పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఎమ్మెల్యే సత్యజిత్ గమాంగ్, పురాధ్యక్షురాలు మమతా గౌడొ, ఉపాధ్యక్షులు శివప్రసాద్ గౌడొ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నరేంద్ర కుమార్ సాహు, కార్యదర్శి లాడి సురేష్, హాజరయ్యారు. ● కొరాపుట్‌లో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరంలో పారిశుద్ధ్య కార్మికులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందజేశారు. పురపాలక అధ్యక్షుడు లలత్ రంజన్ సెరి తదితరులు పాల్గొన్నారు.



బీపీ పరీక్ష చేయించుకుంటున్న ఎమ్మెల్యే గమాంగ్



కొరాపుట్..

ప్రసిద్ధ ప్రాంతాలను కలుపుతూ.. పర్యాటక నడవా

సీతంపేట, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రసిద్ధ ప్రాంతాలను కలుపుతూ పర్యాటక నడవా ఏర్పాటు చేస్తామని పాలనాధికారి ఎ.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. ఆడలి వ్యూ పాయింట్‌ను ఎమ్మెల్యే జయకృష్ణతో కలిసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సీతంపేటలో రూ.4 కోట్లతో గిరిజన మ్యూజియం, రూ.27 కోట్లతో జగతిపల్లి రిసార్టును అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. రూ.50 లక్షలతో ఆడలి వ్యూ పాయింటు వద్ద రహదారులు, క్యాంపింగ్ టెంట్ల ఏర్పాటు, రూ.1.56 కోట్లతో వివిధ నిర్మాణాలు చేపట్టామన్నారు. వచ్చే పర్యాటక దినోత్సవం నాటికి బెనరాయి, సున్నపుగెడ్డ జలపాతాలను అభివృద్ధి చేస్తామన్నారు. పర్యాటకంగా గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందితే ఐటీడీఏలు బలోపేతం అవుతాయని ఎమ్మెల్యే జయకృష్ణ పేర్కొన్నారు. ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి, ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి, ఏపీవో జి.చిన్నబాబు, పర్యాటక అధికారి నారాయణరావు, డీడీ ఎం.అన్నాదొర, పలు శాఖల అధికారులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.


సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డి, పీవో యశంత్‌కుమార్‌రెడ్డి తదితరులు


గిరిజన విద్యార్థినుల నృత్య ప్రదర్శన

ఆడలి వ్యూ పాయింట్ ప్రారంభం..

సీతంపేట మండలంలోని ఆడలి వ్యూ పాయింట్‌ను అట్టహాసంగా ప్రారంభించారు. రూ.1.56 కోట్లతో వ్యూ పాయింట్, కిచెన్ కమ్ బ్రేక్ ఫాస్ట్ ఏరియా నిర్మాణం, టాయిలెట్ బ్లాక్, రైలింగ్, పాత్‌వే, నైట్ క్యాంపింగ్ ఏరియాకు లాన్‌గ్రాస్ ఫ్లోరింగ్, ల్యాండ్‌స్కేపింగ్ వంటి సౌకర్యాలు కల్పించారు. కార్పెట్ గ్రాస్, ప్లాంట్‌లతో వ్యూ పాయింట్‌కి బీటీ రహదారి ఏర్పాటు చేశారు.

చరవాణిలో ఉపాధి సమాచారం..!

అక్రమాలు అరికట్టడానికి జన్‌మన్ నరేగా యాప్

కవిటి గ్రామీణం, సోంపేట, న్యూస్‌టుడే

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు తావు లేకుండా పారదర్శకత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చాయి. ఇందులో భాగంగా వేతనదారులకు అందజేసే సొమ్ము దుర్వినియోగం కాకుండా బ్యాంకు, తపాలా కార్యాలయాల్లో ఖాతాలు తెరిచి వాటి ద్వారా చెల్లింపులు చేస్తున్నారు. కొందరికి ఒకటి కంటే ఎక్కువ ఖాతాలు ఉండటం, ఆధార్ అనుసంధానం ద్వారా డబ్బులు ఏ ఖాతాలో జమ చేశారో తెలుసుకునేందుకు వారు ఇబ్బంది పడేవారు. ఈ బాధలు తప్పేలా కేంద్ర ప్రభుత్వం జన్‌మన్ నరేగా యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. జిల్లాలోని 30 మండలాల్లో 3.84 లక్షల జాబ్ కార్డులు క్రియాశీలకంగా ఉన్నాయి. అందులో 6.18 లక్షల మంది వేతనదారులు ఉన్నారు. వేసవిలో 2.54 లక్షల మంది, ప్రస్తుతం 1.25 లక్షల మంది పనులకు వస్తున్నారు.


కవిటి రాజపురం చెరువులో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు

వినియోగం ఇలా..

ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్‌లోని ప్లేస్టోరు నుంచి జన్‌మన్ నరేగా యాప్‌ను డౌన్‌లోడు చేసుకోవాలి. అందులో పనికి వచ్చే వారి వేతనాలు, పని దినాలకు సంబంధించిన ఐచ్ఛికాన్ని ఎంపిక చేయాలి. రాష్ట్రం, జిల్లా, మండలం, పంచాయతీ, కుటుంబం ఐడీ వివరాలు నమోదు చేయాలి. చెల్లింపు ఐచ్ఛికానికి వెళ్లి వ్యక్తి పేరు ఎంపిక చేస్తే ఎక్కడ పని చేశారు? పని సంఖ్య తదితర వివరాలతో పాటు వేతనాలు, ఎప్పుడు జమ చేశారు. ఏ బ్యాంకులో జమ చేశారో తెలుస్తుంది.

❖ ఉపాధి వేతనాలు జమ కాకపోతే లబ్ధిదారు ఖాతాకు ఆధార్ అనుసంధానం అయిందా? ఆధార్ ప్రకారం బ్యాంకు వివరాలు ఉన్నాయా? అనే వివరాలుంటాయి. అన్నింటికీ అనుసంధానమైతే పచ్చ రంగులో రైట్ గుర్తు.. లేకుంటే దేనికి కాలేదో అక్కడ ఎర్ర రంగులో తప్పు గుర్తు కనిపిస్తుంది. జాబ్ కార్డులోని కుటుంబ సభ్యులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎన్ని రోజులు పని చేశారనే వివరాలూ కనిపిస్తాయి.

ఫిర్యాదులకూ అవకాశం..

ఉపాధి పనుల కింద తప్పనిసరిగా నిర్వహించాల్సిన ఏడు రిజిస్టర్లు, వేతనదారుల పని హక్కులు అందుబాటులో ఉన్నాయి. యాప్ 11 ప్రాంతీయ బాషల్లో అందుబాటులో ఉంది. పనులు తెలుసుకోవడంతో పాటు అక్రమాలపై సైతం యాప్‌లో ఫిర్యాదు చేయడానికి అవకాశం కల్పించారు.

పనుల్లో పారదర్శకత కోసమే..

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో పారదర్శకత కోసం యాప్ ద్వారా సమాచారమంతా అందుబాటులోకి వచ్చింది. ఈ యాప్ ద్వారా వివరాలు క్షణాల్లో తెలుసుకోవచ్చు. పనులు ఎన్ని రోజులు చేశారు? ఎంత సొమ్ము వచ్చింది? ఏ బ్యాంకులో జమ అయిందనే సమాచారం నేరుగా తెలుసుకోవచ్చు.

– సీహెచ్ శ్రీనివాసరెడ్డి, ఏపీడీ, పలాస క్లస్టర్

జంతిబందకు.. మోక్షం కలుగుతుందా..!

న్యూస్‌టుడే, హరిపురం (మందస)

జంతిబందను జలాశయంగా అభివృద్ధి చేయాలన్నది దశాబ్దాలుగా మందస, వజ్రపుకొత్తూరు మండలాల ఉద్దానం ప్రజల ఆకాంక్ష. మందస మండలం బహాడపల్లి పరిధిలో ఉన్న దీన్ని ప్రజల అభ్యర్థన మేరకు తెదేపా జలాశయంగా అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టింది. నీరు-చెట్టు కార్యక్రమం ద్వారా రూ. 1.60 కోట్లు నిధులు మంజూరు చేసింది. పనులు కూడా ప్రారంభమయ్యాయి. దీంతో రెండు మండలాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. తాగు, సాగునీటి కష్టాలు ఇన్నాళ్లకు తీరుతున్నాయని అనుకున్నారు. తరువాత వచ్చిన వైకాపా పనులు నిలిపివేసింది. నిధులు సైతం వెనక్కి మళ్లించడంపై ఆయా మండలాల ప్రజలు ఆవేదన చెందారు. రైతు ప్రభుత్వం అని చెప్పి వైకాపా నాయకులు ఉద్దానం ప్రజలకు అన్యాయం చేశారని వాపోయారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో ప్రజలు మళ్లీ ఆశలు పెట్టుకున్నారు. నియోజకవర్గానికి వంశధార నీరు వచ్చినట్లే ఈసారి జంతిబంద జలాశయంగా మారుతుందన్న ఆశాభావంతో ఉన్నారు.


జలాశయంగా అభివృద్ధి చెందాల్సిన జంతిబంద

వేసవిలోనూ నీరు

జంతిబందలో వేసవిలోనూ నీరు ఉంటుంది. ఆ నీటితో దిగువ ప్రాంతాల్లో ఖరీఫ్, రబీ పంటలు సాగవుతున్నాయి. జలాశయంగా అభివృద్ధి చెందితే సాగు విస్తీర్ణం నాలుగింతలు పెరుగుతుంది. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారమవుతుంది. మెట్ట భూములు సైతం పంటలతో సస్యశ్యామలంగా మారుతాయి.

జలాశయంగా అభివృద్ధికి విజ్ఞప్తి

ఆటంకాలతో ముందుకు కదలని పనులు

అభివృద్ధి చేస్తాం

జంతిబందను జలాశయంగా అభివృద్ధి చేస్తాం. పలాస నియోజకవర్గం పరిధిలోని పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు సాగునీరు తెప్పించాం. మైనర్ ఇరిగేషన్‌లో భాగంగా మందస మండలంలోని కళింగదళ్, డబార్సింగి, దామోదర్‌సాగర్ జలాశయాల మరమ్మతులు, జంతిబంద జలాశయం అభివృద్ధి కోసం ప్రతిపాదించాం. నిధులు రప్పించి పనులు ప్రారంభమయ్యేలా చూస్తాం. – గౌతు శిరీష, ఎమ్మెల్యే, పలాస.

దివ్య పుణ్యక్షేత్రం నిర్మించరూ

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పార్వతీపురం మండలం పెదబొండపల్లిలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో దివ్య పుణ్యక్షేత్రం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఎమ్మెల్యే విజయచంద్ర కలిసి వినతిపత్రం అందించారు. ఆలయ నిర్మాణానికి స్థానికులు భూమి వితరణ చేశారని, చదును పనులు చేపట్టి కంచె కూడా వేసినట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పలుమార్లు నిధులు మంజూరు చేయకుండా వాయిదా వేయడంతో పనులు ఆలస్యం అయ్యాయని తెలిపారు.


దేవదాయ శాఖ మంత్రికి వినతిపత్రం ఇస్తున్న విజయచంద్ర

నీమాస్త్రంతో రైతులకు లాభాలు

భామిని: వరి పైరులో నీమాస్త్రం వేస్తే అధిక దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయం ఎన్‌ఎఫ్‌ఏ ముసలయ్య అన్నారు. శుక్రవారం పోలవరంలో నీమాస్త్రం తయారీ గురించి రైతులకు వివరించారు. ద్రావణం 2, 3 సార్లు పిచికారీ చేస్తే వరి, ఇతర పంటల్లో శత్రు పురుగులు గుడ్లు పొదగకుండా నాశనం అవుతాయన్నారు. సర్పంచి బి.నారాయణ, సిబ్బంది బాలకృష్ణ, ధర్మారావు ఉన్నారు.

పనితీరు మారకపోతే ఉపేక్షించం

భామిని, న్యూస్‌టుడే: గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పనితీరు మార్చుకోకపోతే ఉపేక్షించేది లేదని డ్వామా పీడీ కె.రామచంద్రరావు అన్నారు. కార్యదర్శులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. పంచాయతీల దస్త్రాలు ప్రైవేట్ వ్యక్తుల వద్ద ఎందుకు ఉన్నాయని, లాగిన్ పాస్‌వర్డులను ప్రైవేట్ వ్యక్తి ఆపరేట్ చేయడంపై మండిపడ్డారు. భామిని మండలం పరిశుభ్రత పనుల్లో వెనుకబడిందని, సిబ్బంది తీరు బాగోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రెండు జిల్లాలకు 4 కుంకీ ఏనుగులు

కొమరాడ, న్యూస్‌టుడే: పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో అయిదేళ్ల నుంచి ఏనుగుల సంచారం ఎక్కువైంది. పలువురు ప్రాణాలు కోల్పోగా, చాలా మంది రైతులు పంటలను నష్ట పోయారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులను రాష్ట్రానికి తీసుకొచ్చే ఏర్పాట్లు చేస్తోంది. దీనిలో భాగంగా జరిగిన చర్చల్లో రాష్ట్రానికి 8 ఏనుగులు పంపించేందుకు కర్ణాటక ప్రభుత్వం అంగీకరించింది. మన్యం, శ్రీకాకుళం జిల్లాలకు రెండేసి చొప్పున ఏనుగులు వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇక్కడ నుంచి అయిదుగురు ట్రాకర్లను కర్ణాటక పంపించి శిక్షణ ఇస్తారు. తర్వాత పెంపుడు ఏనుగులతో తిరిగి వస్తారు. ఈ లోపు కుంకీ ఏనుగుల కోసం శిబిరం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. గతంలో జోగింపేటను అనువైన ప్రాంతంగా గుర్తించినా, పూర్తిస్థాయిలో సౌకర్యాలపై అధ్యయనం చేయలేదు.


సంచరిస్తున్న కరిరాజులు

కురుంపేటలో కరిరాజులు..

జిల్లాలోని కొమరాడ మండలం విక్రాంపురం, సివిని, కుమ్మరిగుంట సమీప అటవీ ప్రాంతంలో కరిరాజులు సంచరిస్తున్నాయి. సమీపంలో పొలాల్లోకి వెళ్తుండటంతో పంటలు దెబ్బ తింటున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. సాయంత్రం వరకు ఎవరూ పొలాల వద్ద ఉండొద్దని రైతులను అధికారులు హెచ్చరిస్తున్నారు.

చిరుప్రాయం.. చూపు అస్పష్టం..!

పిల్లల్లో రోజురోజుకు పెరుగుతున్న కంటి సమస్యలు

బాల పౌరుల చూపు మందగిస్తోంది. చిన్న వయసులోనే దృష్టి లోపాలు వెలుగు చూస్తున్నాయి. చాలా మంది పిల్లలు ఉదయం లేచినప్పటి నుంచి కళ్లద్దాలు లేకపోతే ఏ పని చేయలేని పరిస్థితి నెలకొంటోంది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రస్తుతం కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 61,494 మందిని పరీక్షించగా వారిలో 7 శాతం మంది నేత్ర సంబంధిత సమస్యలతో సతమతమవుతున్నట్లు తేలింది.

– న్యూస్‌టుడే, గుజరాతీపేట(శ్రీకాకుళం)



బడి పిల్లల్లో దృష్టిలోపాలు గుర్తించి కళ్లద్దాలు ఇవ్వాలని, అవసరమైన వారికి శస్త్రచికిత్స చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వైకాపా సర్కారు నిలిపివేసిన కార్యక్రమాన్ని పునఃప్రారంభించింది. ఆ మేరకు మొదటి విడతలో 672 ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు 95,566 మంది విద్యార్థులకు పరీక్షలు చేయాలని నిర్ణయించారు. 'స్కూల్ హెల్త్ ఆఫ్ ఐ స్క్రీనింగ్' పేరుతో ఆగస్టు నుంచి ఆప్తాల్మిక్ అధికారులు కార్యక్రమం కొనసాగుతోంది.


సంతబొమ్మాళిలో విద్యార్థినికి కంటి పరీక్ష చేస్తున్న ఆప్తాల్మిక్ అధికారి

తల్లిదండ్రులూ వీటిపై 'దృష్టి'సారించండి..

- చదివేటప్పుడు పుస్తకాలు మరీ దగ్గరగా పెట్టుకుంటారు. అలా కాకుండా కంటికి.. పుస్తకానికి మధ్య 30 సెం.మీ. దూరం ఉండటంతో పాటు కూర్చుని చదివించండి.
- విటమిన్లు, మినరల్స్ సమృద్ధిగా ఉండే ఆహారం అందిస్తే కంటి చూపు మెరుగుపడుతుంది. ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు ఎక్కువగా అందించండి.
- ఖాళీ సమయాల్లో చరవాణులతో కాలక్షేపం చేయకుండా ఆరుబయట ఆడుకునేలా చేయండి. సహజవెలుతురులో ఉంటే హ్రస్వదృష్టి (మయోపియా) వచ్చే ప్రమాదాన్ని అరికట్టవచ్చు.
- ఎక్కువ సేపు టీవీలు, స్మార్ట్ ఫోన్లు వంటివి చూస్తే కళ్లు పొడిబారి సమస్యలు తలెత్తుతాయి. అలా జరగకుండా ఉండేందుకు ఎలక్ట్రానిక్స్ స్క్రీన్ టైం తగ్గించాలి.

ఇదే ప్రధాన కారణం..

చిన్నారులు ఖాళీ సమయం దొరికితే స్మార్ట్ ఫోన్లకు అతుక్కుపోతున్నారు. వీడియో గేమ్స్ ఆడుతూ గంటలకొద్దీ గడిపేస్తున్నారు. ఇదే కంటి సమస్యలకు ప్రధాన కారణంగా వైద్యులు చెబుతున్నారు. పోషకాహారం, జన్యులోపాల వల్ల కూడా కొందరిలో దృష్టి లోపాలు తలెత్తుతున్నప్పటికీ అది స్వల్పమే అని అంటున్నారు.

సిబ్బంది కొరతతో ఆలస్యం..

జిల్లావ్యాప్తంగా మండలానికి ఒకరు చొప్పున 30 మంది ఆప్తాల్మిక్ అధికారులు ఉండాలి. ప్రస్తుతం 18 మంది మాత్రమే ఉన్నారు. దీంతో పాఠశాలల్లో పరీక్షలు చేయడం కొంత ఆలస్యమవుతోంది. సిబ్బంది కొరతను అధిగమిస్తే ప్రక్రియ మరింత వేగవంతమయ్యే అవకాశముంది.

ఇదీ పరిస్థితి

విద్యార్థులు: 61,494

దృష్టి పరీక్షలు జరిగిన పాఠశాలలు: 411

కళ్లద్దాలు అవసరమైనవారు: 4,014

బాలురు: 1,344 బాలికలు: 2,680

అక్టోబరు నాటికి పూర్తి చేస్తాం..

జిల్లాలో ఇప్పటి వరకు 411 బడుల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు చేశాం. ఆయా చోట్ల కళ్లద్దాలు అవసరమైనవారిని గుర్తించాం. ఇంకా 261 పాఠశాలల్లో చేయాల్సి ఉంది. అక్టోబరు నెలాఖరు నాటికి పూర్తి చేస్తాం.

– డాక్టర్ త్రినాథరావు, మేనేజర్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ

అమ్మ దర్శనం.. మార్గం సుగమం

● సీసీ కెమెరాల నిఘాలో ఉత్సవ పర్యవేక్షణ ● వెల్లడించిన డీఎస్పీ


మాట్లాడుతున్న డీఎస్పీ రాంబాబు

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం కోటదుర్గమ్మ దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపడుతున్నట్లు డీఎస్పీ ఎం.రాంబాబు తెలిపారు. గురువారం సాయంత్రం సీఐ ఎం.చంద్రమౌళి, ఎస్సై ప్రయోగమూర్తితో విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఉత్సవాలను నిరంతరం సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తామన్నారు. దీని కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించామన్నారు. పారాది వంతెనపై నుంచి రాకపోకలు పాలకొండ మీదుగా మళ్లించడంతో ఆంక్షలు విధిస్తున్నట్లు వివరించారు. ఉత్సవాలకు సంబంధించి 210 మందితో బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు.

సజావుగా రాకపోకలు

ఉత్సవాలు జరగనున్న రోజుల్లో పాలకొండ పట్టణంలో ట్రాఫిక్ చర్యలు చేపడుతున్నారు. రాజాం వైపు నుంచి వస్తున్న వాహనాలు అన్నవరం కూడలి మీదుగా మళ్లిస్తారు. వీరఘట్టం వైపు నుంచి వచ్చే వాహనాలు అన్నవరం, వడమ గ్రామాల మీదుగా తరలిస్తామన్నారు. ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి రాజాం, వీరఘట్టం, శ్రీకాకుళం వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు ప్రధాన రహదారి మీదుగా వెళ్లనున్నాయి.

11 రోజులపాటు ఆంక్షలు

కోటదుర్గమ్మ ఉత్సవాలు అక్టోబరు 3 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో రెండో తేదీ నుంచి 13 వరకు వాహనాలు మళ్లించనున్నారు. ప్రధాన రహదారిలో ఉన్న అల్పాహార, తోపుడుబళ్ల సిబ్బంది ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. రాయగడ, శ్రీకాకుళం, విజయనగరం వైపు వెళ్లే భారీ వాహనాలు కార్గిల్ కూడలి మీదుగా రాజాం-చిలకపాలెం మీదుగా వెళ్తాయి. శ్రీకాకుళం, రాయగడ వెళ్లే వాహనాలు చిలకపాలెం, రాజాం, రామభద్రపురం మీదుగా వెళ్తాయి. శ్రీకాకుళం, కొత్తూరు, సీతంపేట వెళ్లే వాహనాలు పాత పట్నం, కొత్తూరు మీదుగా వెళ్తాయి. రాయగడ, కొత్తూరు వెళ్లే వాహనాలు కురుపాం, ఎల్విన్‌పేట, బత్తిలి మీదుగా వెళ్తాయి. విజయనగరం నుంచి బత్తిలి, కొత్తూరు వైపు వెళ్లాల్సిన వాహనాలు పార్వతీపురం, కురుపాం, ఎల్విన్‌పేట మీదుగా మళ్లిస్తున్నామన్నారు.

పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు

రాజాం వైపు నుంచి కోటదుర్గమ్మ ఆలయానికి వచ్చే భక్తుల వాహనాలను పాత ఆర్‌అండ్‌బీ కార్యాలయం వద్ద పార్కింగ్ కేటాయించారు. శ్రీకాకుళం, సీతంపేట, కొత్తూరు వైపు నుంచి వచ్చే వాహనదారులు ఆర్డీవో కార్యాలయం పక్కన ఖాళీ స్థలంలో వాహనాలు నిలపాలి. వీరఘట్టం వైపు నుంచి వాహనదారులు కార్గిల్ కూడలిలో వాహనాలు నిలిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.


పాలకొండలో భారీ వాహనాలు

కోటదుర్గమ్మ ఉత్సవాలకు సన్నద్ధం

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం కోటదుర్గమ్మ దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని తెదేపా అరకు పార్లమెంట్ అధ్యక్షుడు, ఉత్సవ పర్యవేక్షకుడు పల్లా కొండలరావు పేర్కొన్నారు. శుక్రవారం ఉత్సవ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది నుంచి సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తామన్నారు. ఆలయ ప్రాంగణంలో ఎలాంటి ప్రచార ఫ్లెక్సీలు లేకుండా పవిత్రతను కాపాడతామన్నారు. గర్భాలయంలోకి పరిమిత సంఖ్యలో భక్తులకు అవకాశం కల్పిస్తామన్నారు. ఉత్సవాలు ముగిసే వరకు కమిటీ సభ్యులు, కూటమి నాయకులు అమ్మ సేవకు అంకితం కావాలని పిలుపునిచ్చారు. తెదేపా పట్టణాధ్యక్షుడు జి.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికైన ఉత్సవ కమిటీ సభ్యులు

22 మందితో కమిటీ నియామకం..

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో 22 మంది కమిటీని నియమించారు. వీరు ఈవో సూర్యనారాయణ, అర్చకులు డి.లక్ష్మీప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో బాధ్యతలు చేపట్టారు. జి.దుర్గారావు, ఎస్.రుద్రకోటేశ్వరరావు, డి.వెంకటరమణ, ఎస్.గుప్తా, ఎ.శ్రీను, కె.లక్ష్మీమూర్తి, కె.రవి, బి.వెంకటరమణ, ఎన్.రమేష్, డి.వెంకటరమణ, వి.సంతోష్‌కుమార్, కె.భాస్కరరావు, కె.చిట్టిబాబు, పి.సాయికుమార్, జి.శంకరరావు, చౌదరి, కె.బీమారావు, ఎం.సంతోష్, పి.సంతోష్, ఎం.రామినాయుడు, కె.కుమార్‌రాజా, బి.సుధను నియమించారు.

రెవెన్యూ శాఖలో బదిలీలు

పార్వతీపురం, న్యూస్‌టుడే: జిల్లాలోని రెవెన్యూ శాఖలో బదిలీలు పూర్తయ్యాయి. ఇక్కడ పని చేస్తున్న కేఆర్సీ ఉపకలెక్టరు (ఇన్‌ఛార్జి డీఆర్వో) జి.కేశవనాయుడు అనంతపురం ఆర్డీవోగా వెళ్లనున్నారు. ఆయన ఇక్కడ గృహనిర్మాణ సంస్థ పీడీగానూ ఉన్నారు. ఆయా స్థానాల్లో ఎవరినీ నియమించలేదు. ఎన్నికల ముందు జె.వెంకటరావు బదిలీపై వెళ్లిన నుంచి డీఆర్వో స్థానం ఖాళీగానే ఉంది. కేశవనాయుడు ఇన్‌ఛార్జి బాధ్యతలు చూస్తున్నారు. పలువురు తహసీల్దార్లను బదిలీ చేసి, బయట జిల్లాల నుంచి వచ్చిన కొందరికి స్థానాలు కేటాయిస్తూ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. మరో 23 మంది ఉప తహసీల్దార్లు, 124 మంది వీఆర్వోలను బదిలీ చేశారు.



నూతన ఒరవడి.. అధిక దిగుబడి

మారుతున్న కాలానుగుణంగా పంటల సాగులో కర్షకులు కొత్త పుంతలు తొక్కుతున్నారు. నూతన ఒరవడికి శ్రీకారం చుట్టి అధిక దిగుబడులు సాధిస్తున్నారు. జియ్యమ్మవలస మండలం పెదకుదమ, చింతలబెలగాం గ్రామాల మధ్యలోని పొలాల్లో మిరప, టమాటా సాగులో మల్చింగ్ పేపర్ పరిచి మొక్కలు నాటేందుకు సిద్ధం చేస్తున్నారు. ఈ విధానంతో కలుపు నివారణతో పాటు నీటి ఆదా, చీడపీడల బెడద తక్కువగా ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. – న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం

మెగా వైద్య శిబిరం

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని డీకే పట్నంలో లయన్స్ క్లబ్, జేమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. పార్వతీపురం, మక్కువ మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన 600 మందికి పైగా ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి రూ.లక్ష విలువైన మందులు ఉచితంగా అందజేశారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. డీసీహెచ్‌ఎస్ వాగ్దేవి, వైద్యులు పద్మజ, వివేక్, రామ్మోహనరావు, శ్రీరాములు, వసంత్‌కుమార్, దుర్గాప్రసాద్, శ్రీరేఖ, వాసుదేవరావు, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

మనోభావాలు దెబ్బతీస్తే భగవంతుడు క్షమించడు

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో గత అయిదేళ్ల పాలన సక్రమంగా సాగలేదని ఎమ్మెల్యే టి.జగదీశ్వరి విమర్శించారు. శుక్రవారం తోటపల్లి దేవస్థానంలో జనసేన, తెలుగు దేశం పార్టీ నాయకులతో కలిసి నిరసన తెలిపారు. హిందువులు దైవంగా భావించే తిరుపతి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించడం సరైన పద్ధతి కాదన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతీసేందుకు ప్రయత్నించిన వారిని భగవంతుడు క్షమించరన్నారు. నాయకులు ఎ.మధుసూదనరావు, ఎం.పురుషోత్తంనాయుడు, ఎ.తవిటినాయుడు, వై.శ్రీనివాసరావు, ఎన్.తిరుపతినాయుడు పాల్గొన్నారు.